క్లుప్తంగా

విద్యార్థులకు సమయపాలన ముఖ్యం



వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ నాయుడు

సీతమ్మధార: ప్రతి విద్యార్థి సమయపాలనకు ప్రాధాన్యమివ్వాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, లింగ్విస్టిక్స్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్(యూఎస్ఏ) రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ గెస్ట్ ఫ్యాకల్టీ ఎస్.వి.ఆర్.నాయుడు సూచించారు. ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు ముఖ్య అతిథిగా ఆయన వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు వెళ్లే సమయంలో టైం మేనేజ్‌మెంట్ గురించి వివరించారు. టెస్ట్ విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఒక ప్రణాళిక ప్రకారం చదవడంతోపాటు నైపుణ్యాల సాధన, కమ్యూనికేషన్ స్కిల్‌పై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంప్రసాద్, తెలుగు టీచర్ జి.ఎస్. వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా



రైతులకు టోకెన్లు ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లకు గురువారం ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పది రోజులకు ఒకసారి స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

మర్రిపాలెం: అతివేగంగా వెళ్తున్న ఆటో ఓ గుర్తు తెలియని మహిళను ఢీకొన్న ఘటన కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఈ నెల 17న సాయంత్రం 6 గంటల సమయంలో 28 బస్‌స్టాప్ నుంచి కంచరపాలెం మెట్టు ఆశీర్వాదం కల్యాణ మండపం వైపు ఏపీ31టీఈ2586 నంబర్ గల ఆటో అతి వేగంగా వచ్చి రోడ్డుదాటుతున్న ఓ గుర్తు తెలియని మహిళను ఢీకొనడంతో ఆమె కింద పడిపోయింది. ఆమె తలకు బలమైన గాయమైంది. అక్కడ ఉన్నవారి సహాయంతో 108లో ఆమెను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. సమాచారం తెలిసిన వారు నేరుగా మృతదేహాన్ని చూసి తమను సంప్రదించాలని పోలీసులు కోరారు. స్థానిక వీఆర్‌వో ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ సీఐ ఎ.ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ అన్వర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

'ఆవిష్కరణలు - అభివృద్ధి'పై జాతీయ సదస్సు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళ కళాశాల బోటనీ విభాగం ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'ఆవిష్కరణలు-అభివృద్ధి సాంకేతికతలు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులు ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ సహసంచాలకుడు డాక్టర్ పీవీకే జగన్నాథరావు సదస్సు ప్రారంభించారు. ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ యంత్రాల పాలనలో దూసుకుపోతున్న తరం మనదని... కృత్రిమ మేధ అభివృద్ధి ప్రతి రంగంలోనూ ఉపయోగపడుతోందన్నారు. జగన్నాథరావు మాట్లాడుతూ పంట అనంతర దిగుబడిలో నష్ట నివారణకు సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజి అతిథులను సత్కరించారు. సదస్సు కన్వీనర్ మాణిక్యకుమారి, డాక్టర్ పి.కె జయలక్ష్మి, డాక్టర్ పద్మసుందరి, సిస్టర్ హేమ, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా జగనన్న పాలన



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ ఉషశ్రీ



48వ వార్డులో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 43వ వార్డులో సామాజిక భవనం ప్రారంభం
- 48వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం

సీతంపేట: అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో రూ.57.70 లక్షలతో 2500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నూతన సామాజిక భవనాన్ని గురువారం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్ని సౌకర్యాలతో అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాలు నిర్మిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాయల శ్రీనివాస్, కాయల పోలీస్, ఠాగూర్, సూరాబత్తుల తిరుపతి, బైరా వెంకట్, బాధ శ్రీనివాస్, సిర్రా లక్ష్మణ్, కంచు పద్మశేఖర్, మట్టా రాణి, బంగారమ్మ జక్కంపూడి సత్తిబాబు, రంజాన్‌వలి, ఎం.గోపి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి కృషి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్–2 ,3, శ్రీనివాస్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో గురువారం పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. సుమారు రూ 32.66 లక్షలతో సామాజిక భవనం, ఓపెన్ జిమ్‌లు నిర్మించనున్నట్లు ఈఈ మత్స్యరాజు తెలిపారు. సుమారు రూ 1.98 కోట్లతో నిర్మించిన జాతీయ రహదారి నుంచి బర్మాక్యాంప్‌కు వెళ్లే బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో కోట్లాది రూపాయలతో కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు.

కె.కె.రాజు పర్యటన

అనంతరం 48, 49 వార్డుల్లోని బర్మాక్యాంప్, ఊర్వశి కూడలి జాతీయ రహదారి పరిధిల్లో జీవీఎంసీ అధికారులు, కె.కె.రాజు పర్యటించి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, డైరెక్టర్ ఐ.రవికుమార్, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, పద్మ, డీఈ భరణికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

మద్యం, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న లక్ష్మి

సీతంపేట: మద్యం, గంజాయి, డ్రగ్స్, ఖైనీ, గుట్కా, బెట్టింగులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రగతిశీల మహిళా సంఘం గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ మనం ఎన్నికల జాతరలో ఉన్నామని, అభ్యర్థులు, పార్టీలు గతంలో హామీలు ఇచ్చేవారని, ఇపుడు ఎటువంటి హామీలు ఇవ్వడం లేదన్నారు. మహిళలపై హింస పెరగడంలో మద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి అత్యాచారాలు పెరుగుతున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకరమైన మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు విమల, సావిత్రి భాయి పూలే ట్రస్టు వ్యవస్థాపకురాలు గూడూరు సీతామాలక్ష్మి, హెచ్ఆర్‌యూఎఫ్ అనూరాధ, అరుణోదయ నిర్మల, అడ్వకేట్ గిరిధర్, ఇఫ్టూ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మర్రిపాలెం: భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం బర్మాక్యాంప్‌లో భర్త సుంకర అనిల్‌కుమార్‌తో కలిసి నీలిమ(21) నివసిస్తోంది. 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తర్వాత నుంచి వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. భర్త అనిల్ కేబుల్ పని చేస్తుంటాడు. బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. అనతంరం వారి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన నీలిమ ఇంటి వంటగదిలోని రాడ్డుకు చున్నీతో ఉరి వేసుకుని ప్రాణం తీసుకుంది. చుట్టుపక్కల ఉన్నవారు గురువారం ఉదయం గమనించి అదే ప్రాంతంలో ఉన్న ఆమె తల్లికి సమాచారం అందించారు. తల్లి మేడ కనకమహాలక్ష్మి వచ్చి చూసేసరికి చిన్నకూతురు నీలిమ విగతజీవిగా మృతిచెంది ఉంది. దీంతో ఆమె అల్లుడే తన కుమార్తె మరణానికి కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధి 11 కేవీ గురుద్వారా, 11 కేవీ సీతంపేట ఫీడర్లలోని ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించే నిమిత్తం సీతంపేట, విజయ హాస్పిటల్, గురుద్వారా, శాంతిపురం, జీవీకే ప్లాజా, రమా హాస్పిటల్, రిలియన్స్ పెట్రోల్ బంక్, క్యాన్సర్ హాస్పిటల్, హిల్ వ్యూ పార్కు, రాకెట్ పార్కు, నార్త్ ఎక్స్‌టెన్షన్ లేఅవుట్, అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అక్కయ్యపాలెం సెక్షన్‌లో..

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో హై టెన్షన్ లైన్ల నిర్వహణలో భాగంగా చేపడుతున్న పనులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు కైలాసపురం, సత్యసాయినగర్, సింగాలమ్మపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రవర్తి, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్లు పిల్లా శ్రీనివాసరావు, సిరిపురపు కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కేంద్రీయ విద్యాలయంలో థింకింగ్ డే వేడుకలు



సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ తదితరులు

తాటిచెట్లపాలెం: పోర్ట్ గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఎదురుగా గల కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో గురువారం ప్రపంచ థింకింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకులు లార్డ్ స్టీవెన్ సన్‌బాడెన్ పౌల్, లేడీ బాడెన్ పౌల్‌ల జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల్‌జీత్ బాడెన్‌లార్డ్ దంపతుల చిత్రపటానికి నివాళులర్పించారు. సంగీతం అధ్యాపకుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ గొప్పతనాన్ని వివరించారు. 3వ తరగతి నుంచి చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 3 నుంచి 5వ తరగతి బాలికలను బుల్‌బుల్స్ అని, బాలురను కబ్స్ అని పిలుస్తారని, 6వ తరగతి దాటిన బాలురను స్కౌట్స్ అని, బాలికలను గైడ్స్ అని పిలుస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సౌట్స్ అండ్ గైడ్స్ నాట్స్, కుకింగ్, ప్రథమ చికిత్స, టెంట్ మేకింగ్, క్లే మౌల్డింగ్, పెయింటింగ్ వంటి అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.మీనా, ప్రధానోపాధ్యాయిని శైలజ, వజ్జా మణిబాబు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, షాహ్లాసబ్రీన్, సత్యనారాయణ, కుందన్‌లాల్, మిట్టపల్లి రేఖ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషతో వ్యక్తిత్వ వికాసం



మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష దోహదపడుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ తెలుగు విభాగంలో నిర్వహిస్తున్న తెలుగు భాష విశిష్టత సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేవలం మార్కుల కోసం తెలుగు భాషను చదవడం సరికాదన్నారు. మనోవికాసాన్ని పెంపొందించే శక్తి మాతృభాషకు ఉందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను మాతృభాషతో పరిరక్షించుకోవడం వీలవుతుందన్నారు. రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ రేవూరి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు చదివిన వారికి అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, సమైక్య భారతి సమన్వయకర్త పి.కన్నయ్య, జి.నాగేశ్వరరావు, డాక్టర్ బి.వెంకటస్వామి, విభాగ ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెంలో ప్రజాపోరు యాత్ర

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్ వద్ద గురువారం బీజేపీ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర నాయకత్వ సూచనలతో ప్రతీ నియోజకవర్గంలోనూ 50 చోట్ల ప్రజాపోరు యాత్రలు నిర్వహిస్తున్నట్లు, ఉత్తర నియోజకవర్గంలో ఇదే మొదటిదని తెలిపారు. ప్రజలకు సంక్షేమం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో స్థానిక, జిల్లా స్థాయి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'వార్వానివాస్' వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్

సీతమ్మధార: వార్వా నివాస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం 'వార్వానివాస్ డాట్ కాం' అనే వెబ్‌సైట్‌ను జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రారంభించారు. నగరం నలుమూలలా ఉండే అపార్ట్‌మెంట్ వాసులు, కాలనీ వాసులకు వార్వా నివాస్ సంఘం కార్యక్రమాలు, సందేశాలను సులువుగా చేర్చడం కోసం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు ప్రెసిడెంట్ ఎస్.ప్రకాశ్ రావు తెలిపారు. ప్రజా సమస్యలు, సంఘ కార్యక్రమాలు, మ్యాగ్జైన్‌లు, డాక్యుమెంట్లు, విద్యా సంబంధిత కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాల సమాచారం తదతర అంశాలను పొందుపరిచినట్లు చెప్పారు. వార్వా నివాస్ తీసుకొచ్చిన వైబ్‌సైట్‌ను, సంఘాల కార్యక్రమాలను, ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ అభినందించారు. నగరంలోని పార్కులను అందంగా, ప్రజాహితంగా నడపడానికి వార్వా నివాస్ సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు పి.లచ్చిరాజు, జనరల్ సెక్రటరీ పిట్టా నారాయణమూర్తి, బి.బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టండి



బీఎల్ఏలకు సూచనలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో గురువారం సోషల్ మీడియా, ఐటీ విభాగంసైనికులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఇది చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్కటై ఎల్లో మీడియాతో జతకట్టి సీఎం జగన్‌పై విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. వాటిని తిప్పి కొట్టవలసిన బాధ్యత సోషల్ మీడియా సైనికులుగా మీ అందరిపై ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కులమతాలకు అతీతంగా రాజకీయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత జగనన్నదేనన్నారు. ఇటువంటి నాయకుడికి అండగా ఉండి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో జగనన్న చేస్తున్న మంచిని ప్రజలకు తెలిసేలా అందరూ పాటుపడాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఐటీ విభాగం ఉపాధ్యక్షుడు సూర్య, విశాఖ జిల్లా సోషల్ మీడియా కో–కన్వీనర్ సదరం జ్ఞానేష్, ఉత్తర నియోజకవర్గ సోషల్ మీడియా కో–కన్వీనర్లు డానియల్, ఖాదర్, వార్డు సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.



సోషల్ మీడియా, ఐటీ విభాగం సైనికులతో మాట్లాడుతున్న కె.కె.రాజు

పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం

జీవీఎంసీ 46, 47, 55 వార్డులకు సంబంధించి బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో నిర్వహించాల్సిన విధులపై వివరించి, పలు సూచనలిచ్చారు. కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని చెప్పారు. ఆ దిశగా ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, 47వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంటిపాము కామేశ్వరి, 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ బగాతి విజయ్, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, బూత్ క న్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా లలితా కామేశ్వరుల కల్యాణం



లలితా పీఠంలో లలితా కామేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శ్రీలలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పీఠం 75వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. కుర్తాళం పురోహితుడు మాచవోలు రమేష్‌శర్మ వేదమంత్రాల మధ్య లలితా కామేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. లలితా కామేశ్వరుల విగ్రహాలను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. ముందుగా లలితాకామేశ్వరులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం పరిసరాలను పూలు, పండ్లతో చూడముచ్చటగా అలంకరించారు. సుముహూర్తం, మాంగల్య ధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కల్యాణం తిలకించారు. అనంతరం తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో పేదలకు భరోసా



దంతాలను పరీక్షిస్తున్న వైద్యులు



వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల వైద్యానికి మరింత భరోసా ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాల ద్వారా ఎంతోమంది లబ్ధి పొందుతున్నారు. జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ కొనసాగించారు. 289, 291 సచివాలయాలకు సంబంధించిన ప్రజలకు సాధారణ శస్త్రచికిత్స, గైనకాలజీ, చర్మవ్యాధులు, దంత, చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) వంటి స్పెషలిస్టు డాక్టర్లు వైద్యం అందించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రభుత్వం ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని మరింత చేరువ చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఇలాంటి సేవలు అందుతున్నాయని, మరే ప్రభుత్వం ప్రజల కోసం ఆలోచించలేదన్నారు. ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

350 మందికి వైద్య సేవలు

ఈ శిబిరంలో 350 మందికి పైగా పేషెంట్లు వైద్య సేవలు పొందారు. బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ వంటివి 700కు పైగా టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఒకే చోట ఇంత మంది వైద్య నిపుణులు అందుబాటులో ఉండటం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉందని, వైద్యం కూడా బాగా అందిస్తున్నారని పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, బి.తిరుమలరావు, మెట్ట దమయంతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎన్ రెడ్డికి ఘన నివాళి



ఎన్ఎస్ఎన్ రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పలువురు నగర వాసులు

సీతమ్మధార: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేసిన ప్రజా నాయకుడు మాజీ ఎమ్మెల్యే, విశాఖ నగర పాలక సంస్థ ప్రథమ మేయర్ దివంగత ఎన్ఎస్ఎన్ రెడ్డి అని పలువురు కొనియాడారు. ఎన్ఎస్ఎన్‌రెడ్డి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో 94వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి వేమన సంక్షేమ సంఘం నాయకులు, బీజేపీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర బీజేపీ అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, శ్రీవేమన సంక్షేమ సంఘం సభ్యులు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యాంకుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధర్మేంద్రరెడ్డి , పులగం సూర్యనారాయణరెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, దల్లి రామకృష్ణరెడ్డి, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.